సమస్యల పరిష్కారానికే గడప గడపకూ..



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న నేదురుమల్లి

వెంకటగిరి: ప్రజాసమస్యల పరిష్కారానికే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని 17వార్డు పరిధిలో శనివారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్ల ప్రభుత్వం నాలుగేళ్లుగా అందించిన పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను అధికారులకు సూచించారు. నేదురుమల్లి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి పార్టీలకతీతంగా అర్హులైన వారందరికీ గడపకు చేరుతున్నాయని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, 17వ వార్డు కౌన్సిలర్, మున్సిపల్ విప్ పూజారి లక్ష్మి, వైస్‌చైర్మన్‌లు ఎస్ బాలయ్య, సీహెచ్ ఉమామహేశ్వరి, పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, మహిళా విభాగం అధ్యక్షురాలు ధనియాల రాధ, కౌన్సిలర్‌లు, నాయకులు పాల్గొన్నారు.

పోలీసులకు మంత్రుల పరామర్శ



గాయపడి చికిత్స పొందుతున్న పోలీసులను పరామర్శిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



పరామర్శిస్తున్న డెప్యూటీ సీఎం నారాయణస్వామి

చిత్తూరు కార్పొరేషన్/ చిత్తూరు అర్బన్ : పుంగనూరు ఘటనలో తీవ్రంగా గాయపడి చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న పోలీసులను డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి , డీఐజీ అమ్మిరెడ్డి, కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ రిషాంత్‌రెడ్డి, డీఆర్‌ఓ రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, ఆర్డీఓ రేణుక, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, ఎంఎస్‌బాబు, ఆర్టీసీ వైస్ చైర్మన్ ఎంసీ విజయానంద రెడ్డి, మేయర్ అముద, నగరపాలక కమిషనర్ అరుణ, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం పరామర్శించారు.

అదే జగన్‌కు బాబుకు తేడా

ప్రజాసంకల్ప పాదయాత్రను జగనన్న ప్రశాంతంగా ముగించారని డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. అదే బాబు , లోకేష్, పవన్ చేపట్టిన యాత్రల్లో నిత్యం అలజడులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. అదే జగన్‌కు బాబుకు ఉన్న తేడా అని వెల్లడించారు. పుంగనూరు ఘటనలో చంద్రబాబును మొదటి ముద్దాయిగా చేర్చాలన్నారు. అధికారదాహంతో అల్లర్లు సృష్టించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో టీడీపీ కార్యకర్తలు సైతం సంక్షేమ పథకాల లబ్ధి పొందుతున్నారని వివరించారు.

రాజకీయంగా దివాలా

రాజకీయంగా దివాలా తీయడంతో చంద్రబాబు ఫ్రస్టేషన్‌తో అరాచకాలకు తెగబడుతున్నారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆరోపించారు. పుంగనూరులో అల్లర్లు సృష్టించేందుకే పోలీసులకు ఇచ్చిన రూట్‌మ్యాప్‌ను మార్చుకున్నారని మండిపడ్డారు. కార్యకర్తలను రెచ్చగొట్టి పోలీసులపై దాడి చేయించడం చంద్రబాబు రాక్షస ప్రవృత్తికి నిదర్శనమని ఆరోపించారు. కుప్పంలో ఓటమి భయంతో ఇంతటి నీచానికి దిగజారారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పుంగనూరు ఘటనకు కారకులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వం, పోలీసుశాఖ ప్రతిష్టాత్మకంగా తీసుకుందని తెలిపారు.

పోలీసులపై దాడి సరికాదు

పోలీసులపై దాడి చేయడం సరికాదని విశ్రాంత పోలీసు అధికారుల సంఘ అధ్యక్షుడు మురళి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజారక్షణే పరమావధిగా విధులు నిర్వర్తించే పోలీసులపై చేసిన దాడికి అల్లరిమూకలు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు.

ప్రపంచ సుందరి కిరీటమే లక్ష్యం

- సేవా కార్యక్రమాల్లో ముందుంటా
- స్టార్ మిస్ టీన్ గ్లోబ్ ఇండియా సంజన

చంద్రగిరి(తిరుపతి రూరల్): సౌత్ అమెరికాలో జరగనున్న స్టార్ టీన్ గ్లోబ్-2024 ప్రపంచ సుందరి కిరీటం సాధించడమే తన లక్ష్యమని స్టార్ మిస్ టీన్ గ్లోబ్ ఇండియా విజేత సంజన తెలిపారు. చంద్రగిరిలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. ఎంతో కష్టపడి ఈ స్థాయికి వచ్చానని, ఇంకా కష్టపడి ప్రపంచ స్థాయికి వెళ్లాలన్నదే తమ ధ్యేయమన్నారు. తన ఎదుగుదలకు తల్లి, బంధువులు, గురువులు, స్థానికులు సాయం చేశారని, వారిని ఎప్పటికీ మరిచిపోనన్నారు. ఏడేళ్ల క్రితం తాను ఒక ఫిజికల్ హ్యాండీక్యాప్డ్ అని (వికలాంగురాలు) సర్జరీ తర్వాత మోడలింగ్ వైపు దృష్టి సారించినట్లు తెలిపారు. దీనికి తన తల్లి పావని ఎంతో సహాయ సహకారాలు అందించారని కొనియాడారు. తాను మోడలింగ్ వైపు చూస్తూ బెంగళూరులో ఆర్‌వీ కళాశాలలో బీటెక్ కంప్యూటర్ సైన్స్ చదువుకుంటున్నానని, ఆన్‌లైన్‌లో ఫ్యాషన్ డిజైనర్ కోర్సు చేస్తున్నానని తెలిపారు. చదువుకుంటూనే సేవా కార్యక్రమాల వైపు దృష్టిసారిస్తున్నానని చెప్పారు. ఫిజికల్ హ్యాండీక్యాప్డ్ వారిని ఆర్థికంగా ఆదుకుంటున్నామన్నారు. చంద్రగిరి బాలికల పాఠశాల భవిత కేంద్రంలో ఉన్నవారికి, తిరుపతి రూరల్ మండలం, దుర్గసముద్రంలో ఉన్న అక్షయ క్షేత్రానికి, చంద్రగిరిలో ఉన్న వృద్ధాశ్రమానికి పలుసార్లు నిత్యావసర సరుకులు అందజేశామన్నారు. జంతువులు, పిల్లలకు సేవ చేయాలనే దృక్పథంతో ఉన్నామని, ఇందుకోసం పలు ఏజెన్సీల కోసం అన్వేషిస్తున్నామన్నారు.

పక్కా ప్రణాళికతోనే పచ్చ గ్యాంగ్ అరాచకం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

తిరుపతి కల్చరల్: పుంగనూరులో పచ్చ గ్యాంగ్ చేసిన అరాచకాలు, పోలీసులపై దాడులు పూర్తిగా ముందస్తు పగడ్బంది ప్రణాళికతోనే జరిగాయని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ఆరోపించారు. ఎమ్మెల్సీ కార్యాలయంలో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. మంగళగిరి మాంత్రిక కోట నుంచి వదిలిన కుటిల ఆయుధ ఫలితమే ప్రశాంత పుంగనూరులో పచ్చ చొక్కా అరాచక శక్తులు చెలరేగిపోయాయని తీవ్రంగా మండిపడ్డారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నియోజవర్గంలో శాంతికి, ప్రజా జీవనానికి భంగం కలుగుతోందని, సమన్వయం పాటిస్తున్నారని తెలిపారు. ఎన్ని రెచ్చగొట్టే రాజకీయాలు చేసినప్పటికీ సమన్వయం పాటించిన పుంగనూరు వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఒక్కొక్క జిల్లాలో ఒక్కో చోట అల్లర్లకు ఆజ్యం పోసేందుకు ప్రత్యేక కౌటిల్య టూల్ కిట్ రూపొందించినట్లు తనకు ప్రత్యేక సమాచారం అందినట్లు వెల్లడించారు. దీని ప్రకారం ఒక్కో జిల్లాలో ఒక్కో రకంగా అరాచకానికి తెలుగుదేశం గ్యాంగ్ పాల్పడుతోందని ఎమ్మెల్సీ ఆరోపించారు. తెలుగుదేశం నాయకత్వం ఈ సారి కొత్త రాజకీయ ఆయుధాన్ని సృష్టించి, డబుల్ బ్యాలెట్ డబుల్ కౌంటర్ కోవర్టు ఆపరేషన్ పుంగనూరులో ప్రయోగించిందన్నారు. శాంతిని కాంక్షించే మధ్య తరగతి ప్రజలే లక్ష్యంగా వాడిన ఈ మాయోపాయ మిస్సైల్ పాకిస్తాన్ ఘోర మిస్సైల్‌లాగా తుస్సుమన్నందన్నారు. ఇలాంటి కుట్రపూరిత, కుయుక్త రాజకీయాలకు పూర్తి పేటెంట్ హక్కులు తెలుగుదేశం నాయకత్వానివేనని విమర్శించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



ఓజిలి: మహిళకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సూళ్లూరుపేట రూరల్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి దక్కిందని ఎమ్మెల్యే కిలివేటి సంజీయవ్య అన్నారు. శనివారం మంగానెల్లూరు సచివాలయ పరిధి గ్రామాల్లోని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యేకు స్థానికుల వద్ద నుంచి ఘన స్వాగతం లభించింది. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు బుక్‌లెట్‌లను అందజేశారు. ఎంపీపీ అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, వైస్సార్ సీపీ నాయకులు జెట్టి వేణు, ఏఎబీ చైర్మన్ ఎం దేవేంద్రరెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, దామతోటి లక్ష్మయ్య పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికం

ఓజిలి: కుల, మత, పార్టీ, వర్గాలకతీతంగా అర్హతే ప్రామాణికంగా పేదలకు సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. మండలంలోని భట్లకనుపూరు పంచాయతీలోని దొడ్లమిట్ట, దేవునికండ్రిగ, భట్లకనుపూరు ఎస్సీకాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు ఘనస్వాగతం పలికారు.



సూళ్లూరుపేటరూరల్: మంగానెల్లూరులో..

ఎల్ఈడీ లైట్ల పంపిణీ

మండలంలోని భట్లకనుపూరు గ్రామానికి చెందిన గున్నం సేవా ట్రస్టు నిర్వాహకులు గున్నంరెడ్డి మధుసూదన్‌రెడ్డి, రాధారెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ప్రజాప్రతినిధులకు ఎల్ఈడీ లైట్లను శనివారం పంపిణీ చేశారు. ఎంపీపీ అరుణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ టీ జనార్దన్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఖాదర్‌బాషా, జయరామిరెడ్డి, రవీందర్‌రెడ్డి, గుడ్ల వెంకట్‌రెడ్డి, సర్పంచ్ ఈ ఉమామహేశ్వరి, గురవయ్య, బీ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థినులకు సన్మానం



రిషితను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గూడూరురూరల్: పట్టణంలోని వీఎస్ఆర్ పాఠశాలలో పదో తరగతి చదివి, ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన సీహెచ్ నూతన లక్ష్మి, నీట్ పరీక్షల్లో సీటు సాధించిన రిషితను శనివారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. పాఠశాల ప్రిన్సిపల్ శాంతకుమార్, డైరెక్టర్ ఎస్ బాలకృష్ణంరాజు, కరస్పాండెంట్ అన్నపూర్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్నదానం

చిల్లకూరు: మండలంలోని కలవకొండలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం భక్తులకు అన్నదానం చేశారు. ఉదయం స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు హైదరాబాద్‌కు చెందిన ఎస్ వెంకురెడ్డి, అహల్య ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. లక్ష్మీనరసింహస్వామి పల్లకీసేవ నిర్వహించారు. ఆలయ ఈఓ నవీన్‌కుమార్, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కే ఆనంద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పోస్టర్ల ఆవిష్కరణ

రాపూరు: స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద శనివారం తహసీల్దార్ ప్రసాద్ జాతీయ నులిపురుగుల దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీ జరిగే జాతీయ డీవార్మింగ్ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వైద్యులు రాజకుమారి, ఎంఈఓలు శ్రీనివాసులు, జిలాని పాల్గొన్నారు.

త్వరగా పూర్తి చేయండి



మార్కింగ్ ఇస్తున్న ఎంపీడీఓ

చిల్లకూరు: జగనన్నకాలనీల్లో ఉపాధి పథకం ద్వారా నిర్మించే ఇంకుడు గుంతలను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ నిర్మలాదేవి సూచించారు. మండలంలోని పారిచెర్లవారిపాళెంలోని జగనన్న కాలనీలో శనివారం ఇంకుడు గుంతల పనులను ఆమె ప్రారంభించారు. హౌసింగ్ ఏఈ అహ్మద్‌బాషా, ఉపాధి ఏపీఓ గిరి బాబు, వర్క్ ఇన్‌స్పెక్టర్ మదురిమ పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు



డీసీసీబీ చైర్మన్‌ను సన్మానిస్తున్న నాయకులు

పెళ్లకూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిల సహకారంతో జిల్లాలోని రైతులకు ఉత్తమ సేవలు అందించడంతోనే మంచి గుర్తింపు వచ్చిందని ఎన్‌డీసీసీబీ చైర్మన్ కే సత్యనారాయణరెడ్డి అన్నారు. శనివారం చిల్లకూరులోని ఆయన నివాసానికి ఎంపీపీ శేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు నన్నం ప్రిస్కిల్లా, నాయకులు, కార్యకర్తలు చేరుకుని, ఆయన్ని, సన్మానించి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు హరిబాబురెడ్డి, చెంచుకృష్ణయ్య, ఎంపీటీసీ సభ్యుడు కుమారస్వామి, జేసీఎస్ కన్వీనర్ రఘునాయుడు, నాయకులు వెంకటరత్నం, మోహన్‌రెడ్డి, వినోద్‌కుమార్‌రెడ్డి, మోహన్, సతీష్‌రెడ్డి, అమరేంద్రరెడ్డి పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

చిల్లకూరు: ఓ యువతిని నమ్మించి మోసం చేశాడన్న తల్లిదండ్రుల ఫిర్యాదుపై తీర ప్రాంతానికి చెందిన ఓ యువకుడిపై శనివారం పోలీసులు పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోపాల్ తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన 17 ఏళ్ల యువతిని మోమిడి గ్రామానికి చెందిన నాసిన గోపి అనే యువకుడు పెళ్లి చేసుకుంటానని నమ్మించి, ఆమెపై అత్యాచారానికి పాల్పడి, అనంతరం మోసం చేశాడు. దీంతో ఆ యువతి తల్లిదండ్రులు యువకుడిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ విచారణ జరిపి, ఆ యువకుడిపై పోక్సో, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ, అత్యాచారం కేసు నమోదు చేసి యువకుడ్ని అరెస్టు చేశారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు.

వేణుంబాకం గ్రామానికి చెందిన షేక్ బాబు బిస్మిల్లా రైతు మిత్ర గ్రూపు సభ్యుడు. ఈయన ట్రాక్టర్, స్ప్రేయర్లు 6, కల్టివేటర్ 2, రోటావేటర్ 2, బాయిలర్ రాయితీ కింద పొందాడు. దీంతో ఆయన 10 ఎకరాల్లో సేద్యం సులువుగా చేసుకుంటున్నాడు. అలాగే గ్రూపు సభ్యులతోపాటు ఇతర రైతులకు ఆ పరికరాలను అద్దెకు ఇస్తున్నాడు. కష్టాలు తీరాయి.



గూని పోలయ్యది కారికాడు గ్రామం. ఈయన టీడీపీ హయాంలో ఎరువులు, పురుగు మందులు పొందాలంటే మండల కేంద్రానికి, లేదా పట్టణాలకు పరుగుతీసేవాడు. వైఎస్సార్ సీపీ అధికారంలో వచ్చిన తరువాత ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు తదితర అన్ని సేవలు ఇంటి వద్ద అందుకున్నాడు. దీంతో ఆయనకు సేద్యం సులభతరం అయ్యింది.



అన్నదాతకు భరోసా

- అన్ని వేళల్లో రైతులకు సలహాలు
- అందుబాటులో ఆర్బీకే సేవలు

విత్తు విత్తిన నాటి నుంచి పంట దిగుబడి వరకు అన్నదాతకు రైతుభరోసా కేంద్రాల్లో అన్ని సేవలు అందుతున్నాయి. గ్రామాల్లోనే వ్యవసాయశాఖ సిబ్బంది అందుబాటులో ఉంటూ కర్షకులకు సలహాలు, సూచనలు ఇస్తుండడంతో సేద్యం సులువు అయ్యింది. ఫలితంగా పుడమిపుత్రులు ఆనందంగా పొలం వైపు సాగుతున్నారు.



నెలబల్లిలో తుది మెరుగుదిద్దుకుంటున్న నూతన ఆర్బీకే భవనం

దొరవారిసత్రం: మండలంలో 11 సచివాలయాలకు అనుసంధానంగా 11 ఆర్బీకేలను ప్రారంభించారు. ఈ కేంద్రాల్లో అవసరమైన సిబ్బందిని నియమించారు. సీజన్ సమయంలో రైతులకు అవసరమైన విత్తనాలు, పురుగు మందులు అందుబాటులో ఉంచడంతో పాటు గ్రామాల్లో భూ స్వాభావం ఆధారంగా ఏ సమయంలో ఎలాంటి పంటలు సాగు చేయాలి? ఎప్పుడు ఏ ఎరువులు వేయాలి తదితర అంశాలపై కూడా ఆర్బీకే సిబ్బంది ఎప్పటికప్పుడు గ్రామాల్లో పర్యటిస్తూ రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. దుక్కి మొదలు పంట దిగుబడి వరకు ఆర్బీకేలు రైతులకు సాయం చేస్తున్నాయి.

మండలం:	దొరవారి సత్రం
మొత్తం ఆర్బీకేలు:	11
ఆర్బీకేల పరిధిలోని గ్రామాల సంఖ్య:	65
సేవలు పొందుతున్న రైతులు:	5,584

ప్రధాన పంటల సాగు ఇలా..

దొరవారిసత్రం మండలంలో 10,850 మంది రైతులు 128 చెరువుల ఆయకట్టులో 12,482 ఎకరాలు, మెట్ట భూములు 15,030 ఎకరాల్లో ప్రధానంగా వరి సాగు చేస్తారు. వేరుశనగ, పుచ్చ, కూరగాయల సాగు చేస్తారు.

నాలుగేళ్లలో...

మండలంలోని 11 ఆర్బీకేల పరిధిలో ఏటా 50 శాతం సబ్సిడీతో 850 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు 3,170 మంది రైతులకు అందజేశారు. అలాగే ఏడాదికి 1,320 టన్నుల ఎరువులు సరఫరా చేశారు. వ్యవసాయ యంత్రీకరణ పథకం కింద 12 రైతు మిత్ర గ్రూపుల సభ్యులకు సుమారు రూ.60 లక్షలు విలువ చేసే 8 ట్రాక్టర్లు, 5 బేలర్లు, 22 రోటవీటర్లు, 23 ట్రాక్టర్ పరికరాలు అందజేశారు.

ప్రతీది నాణ్యమైందే



ఆర్బీకేల్లో ఎరువులు, పురుగు మందులు వంటివి అన్ని తక్కువ ధరకు లభించడంతో పాటు అత్యంత నాణ్యంగా ఉన్నాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో ఆర్బీకేలు ఏర్పాటు చేసి, రైతులకు ఎంతో మేలు చేశారు. గతంలో రైతులకు ఏ అవసరం వచ్చినా పట్టణాలకు పరుగుతీయాల్సివచ్చేది. ఇప్పుడు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతు ఇంటి వద్దనే దొరుకుతున్నాయి.

–ఆనేపూడి భాస్కర్‌రెడ్డి, రైతు, తనియాలి

మద్దతు ధర లభించింది



ఆర్బీకేలు అందుబాటులోకి వచ్చినందున రైతులు పండించిన పంటకు మద్దతు ధర లభించింది. దీంతో రైతులు అధిక లాభాలు పొందుతున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తరువాత కర్షకులు సాగు చేసిన పంటలకు నష్టం జరిగితే ఎప్పడికప్పుడు నష్ట పరిహారం అందుతుంది. క్రమం తప్పకుండా రైతు భరోసా అందిస్తున్నారు.

–ఎస్ సురేష్‌రెడ్డి, రైతు, నెలబల్లి

రైతులకు చాలా ఉపయోగం



గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో రైతులకు చాలా ఉపయోగం కలుగుతోంది. పంటలకు తెగుళ్లు సోకితే, విషయం తెలిసిన వెంటనే సిబ్బంది వెళ్లి పంటలు పరిశీలించి, రైతులకు సలహాలు ఇస్తున్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఎరువుల, పురుగు మందులు, విత్తనాలు గ్రామాల్లోనే అందజేస్తున్నాం.

–ఏ జ్యోతిర్మయి, ఏఓ, దొరవారిసత్రం

గోదాముల తనిఖీ



అధికారులతో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సెక్రటరీ

దొరవారిసత్రం: నెలబల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని ఏకొల్లులో నిర్మిస్తున్న బహుళప్రయోజన గోడౌన్‌ను వ్యవసాయ మార్కెటింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవిచౌదరి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన గోడౌన్ నిర్మాణంతో పాటు వేబ్రిడ్జి, ప్లాట్‌ఫారం నిర్మాణం పనులు తనిఖీ చేశారు. అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడి మండలంలో ఎక్కడెక్కడ గోడౌన్ల నిర్మాణాలు జరుగుతున్నాయి.. అవి ఏ స్థాయిలో ఉన్నాయన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జేడీ రామాంజనేయులు, ఈఈ వెంకటేశ్వర్లు, డీఈలు నారాయణరావు, హరినారాయణరెడ్డి, సీఈఓ గఫూర్ ఉన్నారు.

వ్యక్తిగత శుభ్రతకు ప్రాధాన్యం

చిల్లకూరు: గ్రామాల్లోని యువతులు, మహిళలు వ్యక్తిగత శుభ్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఈఓపీఆర్‌డీ మాణిక్యం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండలంలోని అన్ని సచివాలయాలకు నాప్‌కిన్ మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు రుతుక్రమం సమయంలో ఇబ్బంది పడుతుంటారని, దీన్ని గుర్తించిన రాష్ట్రప్రభుత్వం ప్రతి ఒక్కరికీ నాప్‌కిన్లు సరఫరా చేసేలా ఆయా సచివాలయ వద్ద మిషన్‌ను ఏర్పాటు చేసి వారికి ఉచితంగా అందించేలా ఏర్పాట్లు చేసిందన్నారు.

బకాయిల వసూలు వేగవంతం చేయండి



మాట్లాడుతున్న ఏపీఎం గురవయ్య

చిల్లకూరు: పొదుపు గ్రూపు సభ్యులకు బ్యాంకు ద్వారా ఇచ్చిన స్త్రీనిధి రుణ బకాయిల వసూళ్లను వేగవంతం చేయాలని ఏపీఎం గురువయ్య సూచించారు. చిల్లకూరులోని వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో శనివారం మండలంలోని సంఘబంధం వీఓఏలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 30 పంచాయతీల్లో పలు సంఘబంధం గ్రూపుల సభ్యులు ఇప్పటికే బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించినప్పటికీ, స్త్రీనిధి రుణ బకాయిల చెల్లింపు తక్కువగా ఉందన్నారు. వీటిని కూడా సభ్యులు చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు.

నేదురుమల్లికి సత్కారం

వెంకటగిరి: వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని శనివారం ఆయన నివాసంలో నూతనంగా ఎన్నికైన వెంకటగిరి, డక్కిలి మండలం దగ్గవోలు పీఏసీఎస్ అధ్యక్షులు కే శ్రీనివాసులురెడ్డి, జీ శ్రీనివాసులురెడ్డి శాలువ కప్పి సత్కరించారు. నేదురుమల్లి మాట్లాడుతూ పీఏసీఎస్ అధ్యక్షులు రైతులకు ఉత్తమ సేవలందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఆర్టీసీ రీజినల్ మాజీ కోఆర్డినేటర్ సీ శంకరరెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు పీ ప్రసాద్ రెడ్డి, సీ శ్రీనివాసులురెడ్డి, నాయకు లు ఓ గుర్నాథం, మీరయ్య, రామస్వామి, బాబు పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నివారణ సాధ్యం



వ్యాధిగ్రస్తులతో మాట్లాడుతున్న అదనపు డీఎంహెచ్‌ఓ అరుణ సులోచనదేవి

ఓజిలి: కుష్టువ్యాధి నివారణ సాధ్యమని అదనపు డీఎంహెచ్‌ఓ అరుణ సులోచనదేవి అన్నారు. కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమంలో భాగంగా ఓజిలి ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో పర్యటించి, కుష్టువ్యాధిగ్రస్తులను శనివారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ నెలరోజులుగా ఏఎన్ఎం, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎంఓ డీ అంకయ్య, సీహెచ్‌ఏ సుబ్బరామయ్య, ఏఎన్ఎం సాయి చందన, ఆశాలు నిర్మలమ్మ, లీలావతి పాల్గొన్నారు.

వెంకన్నకు విశేష పూజలు

గూడూరురూరల్: పట్టణంలోని రాజావీధిలో ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఉదయం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం దేవస్థానం ఆవరణలో దుగ్గన రవి జ్ఞాపకార్థం ఆయన కుమారులు దుగ్గన అఖిలేష్‌కుమార్ యాదవ్, దినేష్‌కుమార్ యాదవ్ దాతృత్వంతో అన్నదానం చేశారు.

పదవీ కాలం ఏడాది పొడిగింపు



పొట్టేళ్ల శిరీషా

సైదాపురం: రాష్ట్ర సంగీత నృత్య అకాడమీ చైర్మన్ పదవిలో తనని మరో ఏడాది పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేందని పొట్టేళ్ల శిరీషా పేర్కొన్నారు. మండలంలోని తురిమెర్లలోని ఆమె స్వగృహంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆమె మాట్లాడుతూ తన పదవీకాలాన్ని మరో ఏడాది పొడిగించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తనకు ఈ పదవి ఇచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. ఈ ప్రభుత్వంలో బీసీలకు సముచితమైన స్థానం ఉందన్నారు.

వివాహిత ఆత్మహత్య

సైదాపురం: మండలంలోని తురిమెర్ల గిరిజన కాలనీలో ఓ వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకున్న ఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ చల్లా వాసు కథనం..తురిమెర్ల గ్రామానికి చెందిన ఎన్‌వీ రాజేశ్వరి(మస్తానమ్మ) (37), శ్రీనివాసరావు భార్యాభర్తలు. మనస్పర్థల కారణంగా ఏడేళ్ల క్రితం రాజేశ్వరి పుట్టింటికి చేరింది. తల్లి పెంచలమ్మతో కలిసి జీవిస్తోంది. ఇటీవలన అదే కాలనీలో రేకుల షెడ్ వేసుకుని ఒంటరిగా కాపురం పెట్టింది. ఈ క్రమంలో అనారోగ్యం కారణంగా జీవితంపై విరక్తి చెంది రాజేశ్వరి శనివారం ఉదయం ఉరివేసుకుని తనువు చాలించింది. మృతురరాలి తల్లి పెంచలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

కమనీయం.. నరసింహుడి కల్యాణం



స్వామివారి కల్యాణం జరుపుతున్న అర్చకులు

రాపూరు: మండలంలోని పెంచలకోన క్షేత్రంలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం 4 అభిషేకం, 5 గంటలకు సుప్రభాతం, 6 గంటకు పూలంగిసేవ నిర్వహించారు.10 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను నిత్యకల్యాణ మండలపంలో కొలువు దీర్చి, కల్యాణం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు ఊంజల్‌సేవ నిర్వహించారు.



చెక్కు అందజేస్తున్న దాత శ్రీనివాసమూర్తి

నిత్యాన్నదాన పథకానికి రూ.5 లక్షలు విరాళం

పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శనివారం చిత్తూరు జిల్లాకు జీ శ్రీనివాసమూర్తి, సావిత్రమ్మ దంపతులు రూ.5 లక్షల విరాళం ఇచ్చారు. ఈ మొత్తాన్ని చెక్కురూపంలో ఈఓ జనార్దన్‌రెడ్డికి అందజేశారు. దాతలకు తీర్థప్రసాదాలు అందజేశారు. సిబ్బంది హరీష్, పెంచలరెడ్డి, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం

గూడూరురూరల్: తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ మెహబూబీ అన్నారు. కొమ్మనేటూరులో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీడీపీఓ మెహబూబీ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలను పట్టించాలన్నారు. ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వడంతో చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీఓ జ్యోతికిరణ్, సూపర్‌వైజర్ బి.చెంచులక్ష్మి, సర్పంచ్ పి.వెంకటమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ మస్తానయ్య పాల్గొన్నారు. అలాగే మండలంలోని విందూరు, జీఎస్ కండ్రిగ గ్రామాల్లో సూపర్‌వైజర్ హైమావతి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు.



విందూరులో మాట్లాడుతున్న సూపర్‌వైజర్

ఫర్నీచర్ వితరణ

నాయుడుపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఓ దాత ఫర్నిచర్ వితరణ చేశారని ఆ కళాశాల ప్రిన్సిపల్ గురవయ్య తెలిపారు. ఈ సందర్భంగా దాత బాలకృష్ణారెడ్డిని సన్మానించారు. కళాశాలకు అవసరమైన రూ.35 వేల విలువ చేసే కుర్చీలు, ఇతర ఫర్నిచర్ అందజేశారన్నారు. దాత మాట్లాడుతూ విద్యార్థులు, కళాశాలలు, పాఠశాలలకు కావాల్సిన వసతుల కల్పనలో ముందుంటానని తెలిపారు.

భవిష్యత్ నాశనం చేసుకోవద్దు



మాట్లాడుతున్న ఏడో అదనపు జిల్లా జడ్జి

గూడూరురూరల్: విద్యార్థులు ర్యాగింగ్ పాల్పడి భవిష్యత్ నాశనం చేసుకోవద్దని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, ఏడో అదనపు జిల్లా జడ్జి షమ్మీపర్వీన్ సుల్తానా బేగం సూచించారు. గూడూరులోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ర్యాగింగ్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏడో అదనపు జిల్లా జడ్జి షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం మాట్లాడుతూ కళాశాలల్లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థినీ, విద్యార్థులు ఉంటారన్నారు. జూనియర్లు, సీనియర్లు అందరూ కలసి సోదరభావంతో మెలగాలని సూచించారు. ర్యాగింగ్ భూతాన్ని నివారించేందుకు కఠినమైన చట్టాలు తీసుకువచ్చారని, వాటిపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి పిల్లలను చదివిస్తున్నారని, వారి ఆశయాలను నెరవేర్చి ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి సులోచన రాణి, న్యాయవాదులు గోపీకృష్ణ, అరవ పార్వతయ్య, కళాశాల ప్రిన్సిపల్ పాల్గొన్నారు.

సురక్షతో పలు సమస్యలు పరిష్కారం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ

తడ: జగనన్నసురక్ష కార్యక్రమంలో పలు సమస్యలు పరిష్కా రం అయ్యాయని ఎంపీపీ రఘురెడ్డి అన్నారు. శనివారం తడ ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో 16,664 దరఖాస్తులు అందగా ఇందులో 15,049 ద రఖాస్తులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించి, సర్టిఫికెట్లు అందజేశారని తెలిపారు. అనంతరం పిల్లలకు టీకా పోస్టర్లను ఆవిష్కరించారు. తడ కండ్రిగ సర్పంచ్ టీ జయప్రద పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ జీ సురేష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కే వెంకటేష్, ఎంపీడీఓ ఆమోసుబాబు, పీఆర్ డీఈ రమణయ్య, డీటీ శరత్‌బాబు, ఎంఈఓ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలి

డక్కిలి: నులి పురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రలను ఈ నెల 10వ తేదీ నుంచి పంపిణీ చేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారి జయచక్రవర్తి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. అనంతరం హెచ్‌ఎంలకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. సూపరిండెంటెంట్ అనురాధ, ఎంఈఓలు వెంకటేశ్వర్లు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఫలసరుకుల పంపిణీ

గూడూరురూరల్: పట్టణంలోని త్యాగరాజావీధిలో ఉన్న కల్యాణ వీరభద్రస్వామి ఆలయంలో శనివారం రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్‌వీల్ క్లబ్, ఆంధ్రమహిళా మండలి సహకారంతో 37 మంది దివ్యాంగులకు నెలకు సరిపడా ఫలసరుకులను అందజేశారు. దాతలు పి.విజయ, ఎం.లక్ష్మి, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు విష్ణువందన, మహిళా మండలి అధ్యక్షురాలు జమునమ్మ, కార్యదర్శి స్నేహలతారెడ్డి, రెడ్ సంస్థ అధ్యక్షుడు జానా సుధీర్ పాల్గొన్నారు.

వ్యక్తి దారుణ హత్య



వెంకయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, సీఐ

గూడూరురూరల్: పట్టణంలోని పీఎస్ఆర్ పార్కు వద్ద అరుంధతీయపాళెంకు చెందిన కొళ్లపూడి వెంకయ్య(40) అలియాస్ బట్టోడు శుక్రవారం రాత్రి హత్యకు గురయ్యాడు. ఒకటో పట్టణ పోలీసుల వివరాల మేరకు.. కొళ్లపూడి వెంకయ్యకు చెందిన బంధువుల అమ్మాయితో అదే ప్రాంతానికి చెందిన నాని అనే యువకుడు మాట్లాడుతున్నాడని, మందలించాలని కుటుంబ సభ్యులు తెలపడంతో శుక్రవారం సాయంత్రం నానిని మందలించి కొట్టాడు. దీంతో నాని కోపంతో తన స్నేహితులతో కలిసి వెంకయ్యను హతమార్చాలని పథకం వేసి మరో నలుగురితో కలిసి ప్లాన్ వేసుకున్నారు. దీంతో మరలా గొడవకు వెళ్లిన వెంకయ్యను కళ్లల్లో కారం చల్లి కత్తితో దాడి చేసి హత్యచేసి అక్కడి నుంచి పారిపోయారు. నడిరోడ్డుపై హత్య జరగడంతో చుట్టుపక్కలవారు భయభ్రాంతులకు గురయ్యారు. సమాచారం తెలుసుకున్న డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, సీఐ హజరత్‌బాబు శనివారం సంఘటనా స్థలికి చేరుకుని హత్య జరిగిన తీరును పరిశీలించారు. మృతుడు వెంకయ్య నేరచరిత్ర కలిగిన వ్యక్తి అని, అతనిపై చాలా కేసులు ఉన్నాయన్నారు. గతంలో గంజాయి కూడా విక్రయించేవాడని, ప్రస్తుతం వడ్డీ వ్యాపారం చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని, నిందితులను త్వరలో పట్టుకుంటామని సీఐ పేర్కొన్నారు. మృతదేహానికి గూడూరు ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.